# శరద్రాత్రులు

1

ఆ రాత్రి పుచ్చ పూవులాంటి వెన్నెల, ఎంతో మనోహరంగా ఉన్నది. చల్లని గాలి కూడా ఉండటము మూలాన చాలా హాయిగా ఉన్నది.

కాంతం నా మంచము పైనే, నా ప్రక్కనే కూర్చుని ఉన్నది. మంచముపై నున్న తెల్లని దుప్పటి ఆ వెన్నెలలో మరీ తెల్లనై, చల్లగాలికి కొద్దిగా లేచి. కాంతం చీర చెరగులను తాకి తృప్తితో క్రింద పడుతూ ఉన్నది.

కాంతం శరీర కాంతులు ఆ వెన్నెలలో కలిసిపోయినవి. ఆమె మెడలో తళతళ మెరుస్తూ బంగారపు గొలుసు ఒకటి కులుకుతున్నది. మల్లెపూలు కొన్ని ఆ పక్కపైబడి దొర్లి నవ్వుతున్నవి. కొన్ని ఆమె జడలోకి ఎక్కి ఆడుకొంటూ ఉన్నవి.

స్నిగ్ధములై వెన్నెలలో మెరసిపోతూ ఉన్న ఆమె చెక్కిళ్ళనూ, తాంబూల చర్వణముచే అరుణములైన ఆ పెదవులనూ తాకి నేను ఆవిడతో ఇలాగా అన్నాను.

"ఓ జవ్వనీ! ఈ రాత్రి చాలా తమాషాగా ఉన్నది సుమా!"

ఒయ్యారంగా కాంతం తన చేతిని నా భుజముపైన వేసి "అవును ఈ రాత్రి చాలా రమణీయముగానున్నది. దానికి తగినట్లే ఈ శరత్కాలము కూడా చాలా మనోహరముగా ఉన్నది!" అన్నది.

పరిపుష్టిని పొందిన అవయవముల నుండి పొంగుతున్న యౌవనములో నున్న కాంతానికి దగ్గరగా ఈ చిన్నవాడు జరిగి "అవును నీవు కూడా బహుమనోజ్ఞముగా నున్నావు!" అని అన్నాడు.

మల్లెమొగ్గల వంటి పలువరుసతో ఆవిడ పకపకా నవ్వి, "మీరు కూడా చాలా అందముగా నున్నారు" అన్నది.

ఆ మాట విని ఈ చిన్నవాడు కొంచెము సిగ్గుపడి ఏమన్నాడూ అంటే, "ఓ చిన్నదానా! ఈ సమయములో ఒక్క విషయము నాకు ఆశ్చర్యము కలుగజేస్తున్నది."

.....అని పూర్తిగా చెప్పక ముందే కాంతం అదుర్దాతో ఏమిటండీ అది? అంటూ మరీ దగ్గరకు జరిగి కన్నులలో కన్నులు పెట్టి చూచినది.

అప్పుడు ఈ యువకుడు ఉత్సుకతతో "ఓకాంతా, మనోజ్ఞమైన ఈ వెన్నెలలో కూడా నీ చూపులలో ఉండే చల్లదనము లేదేమో! అని ఆశ్చర్యపోతున్నాను" అని అన్నాడు.

ఈ మాటలు విని కాంతం చాలా సిగ్గుపడి తలవంచుకొన్నది. కొంచెము సేపు అలాగే ఉండి చివరకు అన్నది;

ఏమనీ అంటే, "నా మనస్సుకు ఉల్లాసము కలుగజేసే కథ ఒకటి చెప్పవలసినది" అని.

ఇది విని ఈ కథానాయకుడు కాంతాన్ని తేరిపార జూచి నవ్వి ఆమె జడను ఆది నుండి అంతమువరకూ తాకి తనువుపై పులకలు కలగటము చూచుకొన్నాడు.

ఇల్లాగ ఎంతో అమాయకత్వాన్ని వెల్లడిస్తూ అడిగిన ప్రశ్నకు సమాధానముగా ఈ నాయకుడు అన్న మాటలు ఇవి.

"నీ కోరిక చాలా సరసమైనది. ఉత్తమమైనదీ కూడా. దివ్యమైన కథలు రెండు రకాలుగా ఉంటూ ఉన్నయి. నిజమైన విషయాన్ని వస్తువుగా గ్రహించి జరిగినది జరిగినట్లుగా వ్రాయబడిన కథలు కొన్ని, జరగని విషయాన్ని తీసికొని, జరిగినట్లు చిత్రించబడినవి కొన్ని ఉన్నవి. కవి పుంగవులున్నూ, ప్రాజ్ఞులున్నూ అయినవారు చెప్పినకథలు ఈరెండు రకాలకే చెంది ఉన్నవి.. ఈ రెండు రకములైన కథలలో దేవిగారికి ఏరకపు కథయందు అభిరుచి ఉన్నదో తెలియజేస్తే అల్లాంటి కథ చెప్పటానికి సంసిద్ధుడను."

ప్రియమైన వాక్కుగలదియు దరహాస వికసిత ముఖారవిందయు వినయశీలయూ అయిన కాంతం సుందరమైన ఆకారము కలిగినటువంటిన్నీ, స్వస్త్రీయందే ఎల్లప్పుడూ లగ్నము చేయబడిన మనస్సు కలిగినటువంటిన్నీ, కుటిల కుంతలములు కలిగినటువంటిన్నీ తన భర్తను కొద్దిగా కనులు ఎత్తి చూచి వెంటనే క్రీగంటి చూపులు ప్రసరించి ప్రసన్నవదనంతో అన్నది.

ఏమని అంటే "ప్రాణప్రియా! సాహిత్యాచార్యులు, సత్యమే సుందరమైనదనీ, రమణీయమైనదనీ, అన్నారు కాబట్టి, ఆ నిర్వచనాన్ని మనస్సులో నుంచుకొని మీరు కథ చెప్పవలసినది." ఇల్లాగ నిజాభిలాషను ఎఱుక పరచినది.

కథ చెప్పించాలనే ఉద్వేగంతో కూడుకొని దంత ఖండధావళ్యాన్ని మించిన శరీరచ్ఛాయతో తళతళ మెరుస్తూ ఉన్న కాంతం దేహాన్ని అదేపనిగా చూస్తూ ఈ గ్రంథకారుడూ అన్నాడూ.

"అల్లాగ అయినట్లయితే రామాయణ మహాభారతాది గ్రంథాలలోనివీ, పురాణేతిహాసాలలోనివీ, అయిన కథలు [illegible] సత్యములైనవిన్నీ నీతి దాయకములు అయినవిన్నీ అయి ఉన్నవి. వానిలో ఏదైనా ఒకటి దేవిగారికి వినిపించవలసి ఉంటుంది."

ఇల్లా అనేసరికి కాంతం కించిచ్చకిత అయినటువంటిదై, అంతలో ప్రసన్నయై, కృపారస పూరితమైన దృక్కులు ప్రసరిస్తూ, నిజకాంతునికి దగ్గరగా జరిగి ప్రార్థనా పూర్వకంగా అన్నది.

ఏమనీ అంటే "ఇల్లాంటి కథలు కొన్ని నేను ఇది వరకే విని యున్నాను. వాని రహస్యములు తెలిసికొని కొంత తృప్తిని కూడా పొందిన దానిని అయినాను. ఇదివరలో ఎవ్వరూ విననట్టి కథలు కొన్ని చెప్పవలసినది."

మధురమైన ఈ వాక్కులు వినుటవలన కలిగిన ఆనందముతో పారవశ్యము పొందుతూ, ఆమె కన్నుల వంకనే తదేక నిష్ఠతో చూస్తూ "రాణీగారి ఆజ్ఞను నిర్వహించటానికి ఈ భార్యా విధేయుడు సిద్ధముగానే ఉన్నాడు కాని ఈ భారం నిర్వహించగలడాయని కించిత్సందేహంతో డోలాయమాన మానసుడు అయి ఉంటున్నాడు" అని అన్నాడు ఈ యువకుడు.

అనేసరికి కాంతం ప్రియకాంతునిపై ప్రసన్నదృక్కులను పరపి దక్షిణ హస్తముతో అతని విశాల వక్షస్థలాన్ని తాకి భయపడవద్దు అన్నట్లుగా అతని వీపుపై చరచినది.

ఇల్లాంటి ఉపచర్యల వలన కథలు చెప్పేందుకు కావలసిన ధైర్యాన్నీ బుద్ధినీ ఆయనకు ఇయ్యటమే కాకుండా ఇంకా ఏమన్నదీ అంటే "మీరు అధైర్యపడవలసిన

కారణం ఏమాత్రమూ లేదు. మీ వాక్చమత్కృతీ మాధుర్యం నాకు తెలియంది కాదు. మహిళా జనానికి ఇంపు సంపాదించేటటువంటివీ రసము ఉట్టిపడేటువంటివీ, కథలు చెప్పవలసినది" అని.

కాంతం మనోహరుడు ఈమాటలు విని మిగులహర్షము చెందినవాడై విలాసవతియై, అర్ధనిమీలితనేత్రయై, వ్రీడావతియై, తన మనః సామ్రాజ్యానికి అధికారిణియై, శయ్యపైన అధివసించియున్న కాంతం కరగ్రహణముచేసి ఆమెగారి ఆజ్ఞకు విధేయతను తన చూపులతోనే తెలియజేసి ఊరుకొన్నాడు.

కాంతం వంటి సుగుణవంతురాలిని తాను భార్యగా పొందినందులకు కృతజ్ఞతా భార వినమ్రుడై, జన్మాంతవమ ఆమెగారి ఆజ్ఞను పాలించుటకు కృతనిశ్చయుడై, అతడు ఆవిధంగా ఏమీ మాట్లాడలేకపోయినాడు గదా! ఆ విషయం ఎవ్వరికి తెలియక పోవటము ఎంతో అన్యాయము.

భర్త సుగుణాలను ఎక్కువగా ఎప్పుడూ మెచ్చుకోవటమే స్వభావముగా చేసికొన్న కాంతం కూడా తనకు వశుడైన ప్రియభర్త లభించినందులకే శ్రీకృష్ణభగవానుని మనస్సులో తలచి నమస్కరించినది.

భార్య సుగుణసంపత్తిని గుర్తించగలిగిన కాంతం భర్త కూడా అదే సమయంలో భక్తి ప్రేరితుడై భార్యను మిక్కిలి సమీపించి గాఢమైన అనురాగంతో ఆమెను ఆలింగనము చేసుకొనేసరికి ............ భార్యాభర్తలు ఇద్దరూ ఆలింగనంలో ఉండి విషయప్రవృత్తి కారణాలైన సుగంధ ద్రవ్యాది వస్తువులచే కొంచెము మత్తుకలిగిన వారై కూడా మనస్సులను మాత్రము ఆ రాధికావల్లభుని పాదారవిందముల మీదనే నిలిపివేసినారు.

కొంచెంసేపులో కాంతం మహావేశంతో అన్న మాటలు ఏమి అనగా, "ఓ మనోజ్ఞమూర్తీ తమకు ఒక్కమాట చెప్పవలసినదిగా శ్రీకృష్ణ భగవానుడు నాకు ఆజ్ఞ ఇచ్చినట్లు తోచినది."

ఈ మాటలువిని నాయకుడు చాలా వ్యాకులత పొంది ఆమెగారి వైపు తదేక దృష్టితో చూడగా ...... కాంతం దరహాస వికసిత వదనంతో విస్ఫారిత నేత్రద్వయముతో లజ్జ ఒకవైపునా ఔత్సుక్యము ఒకవైపునా ఆమెకు వింజామరలు వేయగా, అటూఇటూ తలత్రిప్పుతూ ఎప్పుడూ ఆ జ్ఞాపకము ఉంచుకోదగిన మాటలు అన్నది.

ఏమని అన్నది అనగా, "సహజమైన చాతుర్యముతో ఒప్పారేటువంటివీన్నీ, నిశితంగా దాపరికంలేని హృదయముతో వ్రాయబడి, సరస్వతీదేవి కంఠహారం కాగలయట్టివీన్నీ, చిరకాలము స్మరణీయమైనట్టివీన్నీ, రసికుల హృదయాలను సంతోష పెట్టగలిగినట్టివీన్నీ, మహిళాజన హృదయాలను ఆనందము చేకూర్చేటటువంటివీన్నీ, ముఖ్యముగా దాంపత్య మహాత్మ్యాన్ని ఎక్కువగా వెల్లడి చేసేటువంటివీన్నీ, కథలు మీరు వ్రాయవలసినది."

ఈ మాటలు విని ప్రసంగకుశలుడైన ఈ యువకుడు ఇల్లాగ అన్నాడు. "దాంపత్య మహాత్మ్యాన్ని ఎల్ల[illegible]మని నీవు అడగటం ధర్మసమ్మతమైన కోరికే".

కవులకిట్టి రచనలు క్రొత్తగాదు. ప్రపంచం కళ్ళబడకూడదని, మనుష్యసంచారం లేని హిమాలయపర్వతాలెక్కి కూర్చున్న పార్వతీ పరమేశ్వరుల పావన ప్రణయకథను కవులు గానం చేశారు.

ఇదిగాదని, పాలకడలిలో శేష పాన్పుపై పవ్వళించిన రమాకేశవుల విశ్వశ్రేయః ప్రేమనూ, నందనా రామంలో కల్పపాదపచ్ఛాయల, అప్సరసల నృత్యాలమధ్య శచీదేవేంద్రులు చవిచూచిన అనురాగసుధాబిందు మాధుర్యమునూ, కవులు కావ్యరూపంలో మనకు సాక్షాత్కరింపజేశారు.

అట్లే నేను మన దాంపత్య కథనే వ్రాస్తా"నని చెప్పే వరకు కాంతం కృత్రిమ రోషకషాయ నేత్రయై "ఓహో ఎంతటి చతురులు మీరు! ఎంతటి మహాత్ములు! నామీదనా కటకట, మీ వచోరచనా కౌశలము" అని వెక్కిరించినది.

అందుపై ఈ గ్రంథకర్త ఇల్లా అన్నాడు. "సరస్వతీ చతుర్ముఖుల శృంగారలీల కళాపూర్ణోదయమునకు మూలము అయింది. అల్లాగే మన దాంపత్య శృంగార లీలనే ఈ కథలకు మూలము అవుతుంది."

ఇల్లా అనేసరికి కాంతం సంతోషించి మిమ్ము గనిన తల్లి కడుపు "చల్లగా సదా మనవలయునని" దీవించి భర్త కంఠమును సువర్ణ వర్ణములైన బాహువులచే పరిరంభ మొనర్చినది.

కాంతం ఆనాటినుంచీ కథానాయిక అయినది. ఆదర్శ గృహిణి అయినది. సృష్టిలో ఉన్న రమణీయ వస్తువుల సౌందర్యమంతా ఆమెను ఆశ్రయించినది.

వెన్నెల చల్లదనమూ, పూరేకుల మెత్తదనమూ, మేల్మిబంగారు ఛాయ, ఆమె సుకుమార సుందం శరీరకాంతికి ఉపమానములయినవి. ఆమె పరిహాసపు వాక్కులు, నా యీకావ్యమునకు "మానిషాద" ప్రాయములైనవి. ఆమె శృంగార లీలలే కథలైనవి. ఆ దాంపత్య కథారసామృతమే స్వర్ణపాత్రలలో లోకానికి అందించడము నా పనియైనది. కాంతం కథల జన్మ వృత్తాంతము అట్టిది.

2

ఉదయభానుడు నిద్రపోతున్న తామర మొగ్గలను తన కిరణ హస్తాలతో మేల్కొలిపినట్లు, కాంతం తెలతెలవారుతూ ఉండంగా వచ్చి నన్ను లేపుతుంది.

కాంతం నాకంటే ముందుగానే లేచి కాలకృత్యాలు తీర్చుకొని, స్నానంచేసి తలదువ్వుకొని, పూలు పెట్టుకొనివచ్చినది నాగదిలోకి.

"ఇంకా నిద్రపోతూనే ఉన్నారూ? పొద్దెక్కింది. లేవరూ అన్నది. నేను ఆమాటలు విని కూడా నిద్రనటించాను. ఆవిడ వచ్చి నాపైకి వంగి, తేలికగా తాకి బుగ్గపైన చిటిక వేసి 'లేవరూ' అన్నది.

"నేను లేవను చాలా బద్ధకంగా ఉంది. పడుకొంటాను" అన్నాను.

"కాలేజీకి వెళ్ళరా?"

"వెళ్ళను."

ఆవిడ మంచం మీద నా ప్రక్కనే కూర్చుండి ముఖం మీద పడిన జుట్టును సవరిస్తూ "ఇదేమీ బాగుండ లేదు. మీరు కాలేజీకి వెళ్ళక తప్పదు" అన్నది.

"నాకు బాగానే వుంది" అన్నాను.

"మీకు బాగానే వుంటుంది! అంతా నన్ను అంటారు" అన్నది కాంతం, బుంగమూతిపెట్టి.

"నేను లేవలేను" అని కచ్చితంగా చెప్పి ముసుగు బిగించాను మళ్ళీ.

"ఉహూ! అదేమీ కుదురదు, లేవండి" అని కాంతం నా పాదాల పైన చెయ్యి వేసింది.

నేను అనేక కారణాలు చూపించి కాలేజీ మానటానికి ప్రయత్నం చేశాను. కాని ఆవిడ గట్టిపట్టుపట్టి నన్ను బలవంతంగా నిద్రలేపి స్నానం చేయించి భోజనం పెట్టి బడికిపంపింది.

సాయంత్రం కాలేజీ నుంచి ఇంటికి రావటంతోనే సుఖంగా భోజనం చేసి వెన్నెలలో తెల్లని పరుపుపైన పండుకొని నిద్రపోవటానికి ప్రయత్నం చేస్తున్నాను.

కాంతం కూడా భోజనం పూర్తి చేసి వచ్చింది. తెల్లని జరీచీరపై వెన్నెలలు జారిపోతున్నవి. ఆమెవచ్చి కూర్చుండి "ఇల్లాగయితే ఎల్లాగండీ! పుస్తకం తెరవటం మానేశారే!" అని అన్నది.

"అయితే ఏంజెయ్యమంటావూ" అని అడిగినాను.

"తోటివాళ్లంతా ఏంజేస్తున్నారండీ! చక్కగా కష్టపడి చదువుకోటం లేదూ!"

"చదివి పరీక్షకు కూర్చుని ప్యాసయి చివరకు చేసేదేమిటి?" అని నేను చప్పరించాను.

"ఏమీ లేకపోతే ఎందుకు చదువుతున్నారూ?" అని అడిగింది కనుబొమ్మలు ఎగరవేస్తూ.

"వాళ్లకు పిచ్చి!" అన్నాను.

"మీరు వాళ్ళ మోస్తరు విద్యార్థులే! మీరంతా ఒక కాలేజీలోనే చదువుకొంటున్నారు." అని నవ్వింది కాంతం.

"అవును, కాని నాకింకా అంత పిచ్చి ఎక్కలేదు" అన్నాను.

కాంతం నవ్వి, "అల్లాగకాదు. మీరు చదువుకోకపోతే ఎల్లాగ చెప్పండి," అని బుజ్జగించింది. నేను ససేమిరా చదువుకోనన్నాను.

ఆ తెల్లని పక్కా ఆ సువాసనలూ, ఆ మనోహరమైన వెన్నెలనూ వదిలివేసి గదిలో దీపం ముందు కూర్చుండి ఛార్లెస్ ది గ్రేట్ గురించి చదివేటందుకు నేనేమీ

బుద్ధిహీనుణ్ణి కాదు.

అక్కడ పండుకొని మబ్బులను తరుముకొంటూ పోతున్న చంద్రుణ్ణే. కాంతం స్నిగ్ధకపోలాలను, అరుణాధర సౌభాగ్యమును చూస్తూ మౌనం వహించాను.

ఆమె "ఏమిటి ఆలోచిస్తున్నారు?" అన్నది.

"ఒక ముఖ్యమైన విషయాన్ని గురించి ఆలోచించాను. ఒక నిశ్చయానికి వచ్చానుకూడా, నేను రేపటి నుండి కాలేజీకి కూడా వెళ్లను" అన్నాను.

"ఎందుకు వెళ్లరూ?" అని అడిగింది ఆదుర్దాగా!

"అక్కడ నేర్చుకోవలసిన విషయములు ఏమీలేవు. ఇంట్లో నీదగ్గర ఉండి చాలా విషయాలు నేర్చుకోవలసి ఉన్నది." అన్నాను.

"నా దగ్గర ఉండి నేర్చుకొన్న విషయాలను చూచి సంతోషించి మీకు ఎవరైనా ఉద్యోగం ఇస్తారా" అని అడిగింది నవ్వుతూ.

"ఎవ్వరూ ఇయ్యకపోతే నీదగ్గరే ఉద్యోగం చేస్తాను." అన్నాను

"జీతం ఎంత ఇయ్యవలసి ఉంటుందో! కొంచెం చెప్పండి?" అన్నది కాంతం.

"అట్టే ఏమీ అక్కరలేదు తినటానికి అన్నం, కట్టుకొనేందుకు బట్ట. అంతే చాలు" అన్నాను.

"అంతటితో తృప్తిపడితే మీరు ఈ ఉద్యోగంలో చేరవద్దు. భగవంతుడు ఇచ్చినంతలో ఆమాత్రము ఇయ్యగలను"

అయితే యింకేమీ! ఇప్పటినుంచీ డ్యూటీలో చేరుతాను. నేను చేయవలసిన పనులు ఎల్లాంటివో కొంచెము చెప్పాలె నువ్వు."

"అంత కష్టమైనపనులు ఏమీ ఉండవులెండి."

"అసలు రోజుకు ఎన్ని గంటలు పనిచెయ్యాలె?"

"ప్రొద్దున్న తొమ్మిదిగంటలనుండీ, సాయంత్రం అయిదు గంటలదాకా డ్యూటీలో ఉండాలె"

"చేయవలసిన పనులేమిటి?"

"చాలావరకు నా ముందు నుంచోటం."

"నుంచుని?"

"నుంచుని నన్ను చూస్తూ ఉండటమే!"

"ఇంకా?"

"నాకు పూలు తెచ్చి పెట్టటం. నేను అలంకరించుకొంటూ ఉంటే నాకు తోడ్పడటం."

"దాని తరువాత?"

"దాని తరువాత ఇంకేదైనా పని చెప్పితే చెయ్యటం"

"ఏమీ పని లేకపోతే"

"ఊరికే నుంచోటం"

"ఎంతసేపైనానా?"

"ఆ"

"నుంచుని నుంచుని అలసిపోతే కూర్చోవచ్చునా"

"ఆ". "కూర్చుని కూర్చుని విసుగుపుడితే పడుకోవచ్చునా?"

"అఁహ, అట్లావీలులేదు. కూర్చుని కూర్చుని విసిగిపోతే మళ్ళీ నుంచోవాలె"

"అది కష్టం!"

"అయినా తప్పదు."

"నుంచోనంటే?"

"నుంచోనని యజమానురాలియందు భయభక్తులు లేకుండా ప్రవర్తిస్తే ఫైను పడుతుంది."

"జీతం, భత్యంలేని ఉద్యోగం చేస్తున్న వాడు ఫైను ఎక్కడ ఇచ్చుకోగలడూ?"

"ఫైను ఇయ్యకపోతే ఖైదుపడుతుంది. సాయంత్రం అయిదు అయిన తరువాత కూడా గది గుమ్మం దాటటానికి వీలుండదు."

"ఇల్లాంటి ఉద్యోగం చెయ్యటం కొంచెం కష్టమే. యజమానురాలు కొంచెం కఠిన స్వభావం కలదానిలాగు కనిపిస్తూ ఉంది."

కాంతం తన రెండు చేతులనూ నాభుజంపైన వేసి కౌగిలించుకొని "మీ యజమానురాలు ఏమాత్రం కఠిన స్వభావం కలది గాదండి. కావాలంటే ఒకపూట నౌకరీ చేసి చూడవచ్చు'నన్నది.

"అయితే నేను ఈ క్షణంలోనే నౌకరీలో ప్రవేశిస్తున్నాను. ఏంజెయ్యాలో సెలవియ్యండి" అని లేచి నిలబడ్డాను.

కాంతం కూడా లేచి నిలబడి "ఇక నుంచి మీరు నాయెడల విధేయతతో ప్రవర్తించాలిసి ఉంటుంది, తెలిసిందా!" అని అడిగింది.

"చిత్తం" అన్నాను నేను.

ఆపళంగా ఆమె గదిలోకివెళ్ళి మల్లెపూల చెండు ఒకటి తెచ్చి నాచేతిలో పెట్టింది.

"ఏమి చేయమని సెలవు?" అన్నాను.

"ప్రతి విషయమూ చెప్పటం మర్యాద కాదు. యజమానురాలి ఇంగితము గ్రహించి ప్రవర్తించాలె" అని నాకు హితము బోధించినది.

ఇల్లాగ అని ఆమె గిరుక్కున తిరిగి ముఖం మరుగు చేసింది. నున్నగా దువ్వబడిన జుట్టు వెన్నెలలో మెరుస్తున్నది. ఆ వేణీవైభవాన్ని ఆ విశాలమైన వక్షస్థలవు వెనుకభాగాన్ని చూస్తూ, "గంగకద్దరి మేలిద్దరికీడునుం గలదె" అనుకొంటూ కనులప్పగించి నిలుచున్నాను.

"ఏం చెయ్యాలో తెలియలేదూ?" అని కోపపడ్డది యజమానురాలు. నేను చప్పున తెలివి తెచ్చుకొని ఆ పూలచెండును ఆమె వేణీబంధంలో అలంకరించాను.

ఆమె పూలచెండును చేతితోతాకి చూచుకొని మళ్ళీ నా వంకతిరిగి

"మీరు ఇల్లాగ ఇంగితం తెలుసుకొని, పనిచేస్తిరా కొద్దిరోజులలో మీకుమంచి బహుమానం కూడా ఇస్తాను" అన్నది పకపక నవ్వుతూ.

"మహాప్రసాదం" అన్నాను.

కాంతం నాకు కొంచెం ప్రక్కగా నుంచునివుంది. నేను దగ్గరలో వున్న కుర్చీలో కూర్చున్నాను. ఆవిడపైట సర్దుకొని నాకెదురుగా వచ్చి నిలువబడి నన్ను ఆజ్ఞాపించింది.

"స్టాండ్," అని

లేచి నుంచున్నాను విధేయతతో, 'నడవండి' అన్నది. నేను నడిచాను "ఇటు ఇటు ఇటు" అని మంచము చుట్టూ తిప్పి చివరకు ఆ తెల్లని పాన్పుపై పడుకోమని ఆజ్ఞాపించింది.

నేను మాట్లాడకుండా విధేయత చూపాను. నా స్వామి భక్తి జూసి ఆకాశం పకపకా నవ్వింది.

3

కాంతం తెల్లటి పక్కమీద పండుకొని ఉంది. ఆప్రక్కనే యున్న మరొక మంచంపైన నేను కూర్చున్నాను. ఆమెకు నిద్రపట్టింది.

ఆ వెన్నెలలో ఆవిడ ఎంతో మనోహరంగా ఉంది. వెన్నెల కాంతంపై పడుతున్నది. కాని ఆమె చెక్కిళ్ళు ఆ వెన్నెలను తినేస్తున్నాయి, నేను చూస్తూ కూర్చున్నాను.

ఆమె పెదవిపై కెక్కి నాట్యంచేస్తున్న ఎరుపును తెలుపు చేయాలని వెన్నెలలు ప్రయత్నంచేసినై. మా కాంతం కళ్లుమూసుకొని ఉన్నప్పుడూ అందంగానే ఉన్నది. వెన్నెల ప్రవాహంగా వచ్చేసరికి చీకట్లు కొన్ని పారిపోయివచ్చి ఆమె గడ్డం క్రింద దాక్కొన్నాయి.

కాసేపు ఆ సౌందర్యాన్ని చూచి తృప్తిపడి నేనూపండుకొని నిద్రపోయాను. ఒక అర్ధరాత్రి వేళ మల్లెపూల పరిమళం ఒకటీ, మృదువైన హస్తము ఒకటీ నన్ను మేల్కొలిపినై.

కాంతం నాప్రక్క పైన కూరుచుండి నా భుజం పైనచెయ్యివేసి 'ఏమండీ! కలలు నిజమౌతాయండి?" అని అడిగింది.

నేను ఏమి చెప్పేది? 'కొన్ని కలలు నిజమౌతవి' అన్నాను. ఈ మాట విని కాంతం భయపడ్డట్టు ఉలికిపడి, 'నిజంగానండీ, కలలో చూచినట్లు జరుగుతుందా?' అని అడిగింది.

నేను ఆవిడ స్థితి తెలుసుకొని వీపుమీద తట్టి 'కలలు ఎందుకు నిజం అవుతయ్యే పిచ్చిదానా' అన్నాను. 'మరి ఇందాక అలాగ అన్నారేఁ' అన్నది. ఊరికే అన్నాను నీకేం భయంలేదు పడుకో' అన్నాను.

ఆవిడ నాకు కొంచెం దగ్గరకు జరిగి 'చూడండీ నాకు ఒక చెడ్డకల వచ్చింది' అంటూ బిత్తరిచూపు చూసింది.

'ఏమిటాకల?' అన్నాను నేను.

'కలలో మీరు కనపడ్డారండీ' అన్నది భయపడుతూ.

'నేను కనపడ్డానా! కనపడితే భయం ఎందుకూ'

'మీరు చేసిన పనికి' అన్నది.

ఈ మాటలు నన్ను చకితుణ్ణి చేసినై. ఆవిడకు వచ్చిన కలలో నేను ఏం చేశానో ఎట్లా తెలుస్తుంది. అందుకని 'ఏం చేసానేమిటి' అన్నాను.

ఆమె ఇంతింతకళ్ళు చేసికొని 'తల్చుకుంటే ఇప్పటికీ ఇంకా అసహ్యంగానే ఉంది' అన్నది.

ఏదో అసహ్యం కలిగించే పనిని చేశానన్నమాట.

అది ఏపని అయినా కానీ, కలలోనైతే మట్టుకేం, నేను చేసి వుండాలిసింది కాదు. అందుకని నేను వెంటనే అన్నాను 'కాంతం! క్షమించు, అదేదో చాలా తప్పుపని అయివుంటుంది. నేను చేయాలని చేయలేదు'.

'చెయాలనే చేశారు' అన్నది కాంతం.

'అట్లాయెప్పుడూ అయివుండదు. అయినా 'ఏమిటో చెప్పూ' అన్నాను. నేను కళ్ళారా చూశాను మీరు ముద్దు పెట్టుకోటం' అన్నది కాంతం.

ఇంతకూ నేను చేసిన తప్పు ముద్దుపెట్టుకోటం అన్నమాట! అయితే తప్పకుండా

బుద్ధిపూర్వకంగానే చేసి ఉంటాను' అన్నాను నవ్వుతూ.

'పైగా చెప్పుకుంటారుకూడాను. ధైర్యంగా! ఎంత తప్పుపనండీ! అది' అని ఆవిడ తెలతెలపోయింది.

'నాభార్యను నేను ముద్దుపెట్టుకొంటంలో తప్పేమిటో నాకు అర్థం కావడంలేదు,' అన్నాను నేను.

'మీ భార్యను ముద్దెట్టు కోడం కాదు; మీరు ఎవరో మరొక స్త్రీని ముద్దెట్టుకొన్నారు' ఆవిడ.

'శివశివ! నేను ముద్దెట్టుకోలేదు' అన్నాను కాని ఆవిడకు తృప్తికలుగలేదు. నేనేమీ ఎరుగను' అన్నా. ఆవిడ, కలలో అయితే మట్టుకు ఎందుకు ముద్దెట్టుకోవాలె?

నేను చేసిన తప్పుకు ఆవిడ శరీరంలోని ప్రతిభాగమూ నాపైన ఆగ్రహం వహించింది. ఆవిడ పెదవి జేవురించింది. ఆ వెన్నెలలో కూడా భ్రూలతలు కోపంతో ముకుళించుకు పోయినై.

ఆవిడ తర్జని ముక్కుపైకెక్కి తప్పు తప్పు అని అరచింది. జడ నాపైకి ఎగిరి పడ్డది.

ఆవిడగారి కలలో కనపడ్డ విషయాలకు నేను ఎట్లా బాధ్యుడినో భార్యకు చెడ్డకలలు రాకుండా చూడవలసిన బాధ్యత కూడా భర్తదేకామోలు! ఎవ్వరికి తెలుస్తవి ఈ మర్యాదలన్నీ.

నాతప్పు ఏమీ లేదని నిశ్చయించుకొని ఆవిడ అమాయకత్వానికి నవ్వుకొని కళ్ళుమూసికొని పడుకొన్నాను.

ఆమె కూడా పడుకొని నిద్రపోతుందనుకొన్నాను.

నాకు నిద్రపడుతూ పడుతూ ఉండగా ఆమె చల్లని మల్లెపూలతో నన్నుతాకి 'ఏమీ ఎరుగనట్లు హాయిగా ఎల్లా నిద్రపోతారండీ మనస్సుకు ఇంత కష్టంగా ఉంటే?' జడ తీసి భుజంపైకి విలాసంగా విసిరి వేసికొంటూ.

నిద్రకళ్ళతో చూశాను. ఆమె లావణ్యము వెన్నెలలో మెరసిపోతున్నది. వెన్నెలను

తాగుతూ ఉన్న ఆమె తనువూ, చలిస్తూ ఉన్న ఆ కళ్ళూ, కట్టుకొన్న తెల్లని ఝరీచీరా అన్నీ కూడా నానిద్రాముద్రిత వదనాన్ని చూచి నవ్వినది.

నేను ఎవరినో ముద్దు పెట్టుకొన్నట్లు ఆమెకు కల రావటం అందుకై ఆమెగారికి కష్టంగా ఉండటం, అది గుర్తించక నేను నిద్రపోవటము, అది ఒక పెద్ద తప్పుగావటం, దీన్ని జూచి చందమామ సహితం మేఘాన్ని మరుగుజేసికొని వికవిక నవ్వటం! బాగానే ఉంది! అనుకున్నాను.

ఆమెకు కల ఎందుకు రావాలే! వస్తే మటుకు అల్లాంటికల ఎందుకు రావాలే! అయినా ఆ దుస్వప్నానికి నేనెట్లా బాధ్యుణ్ణి? నాకేమీ బోధపడలేదు.

అయినాకలలో జరిగినదానికి ఆమె అంతగా కష్టపడటం నాకేమీ నచ్చలేదు. అందుకని ఆమెగారి మాటలకునవ్వి ఊరుకొని కళ్ళు మూసికొని నిద్రపోవటమే ఉచితమైనపని.

అలాచేద్దామనుకొన్నాను. కాని ఆ చల్లని ప్రసన్నమైన వెన్నెలలో పరదీనవదనయై, అవనతముఖియైయున్న ఆసుకుమార రూపవతిని చూచి నిర్లక్ష్యం చేయలేకపోయినాను.

అందుకని కాదూ నేను ఆమెకు మరికొంచెము దగ్గరగా జరిగి 'కాంతం, అయితే, నీవునిద్రపోకుండా ఇల్లాగ కూర్చున్నావు ఎందుకూ, అని బుజ్జగిస్తూ అడిగాను!

అలా అడిగినా ఆమె మాట్లాడకుండా ఊరుకున్నది. ఈ దుస్వప్నం కాంతాన్ని చాలా వ్యాకులత పెట్టినట్లుంది. నేను ఆమె ఎడల 'సదాహృదయకౌతుక హేతుకళా విధిజ్ఞుడౌ' పురుషుణ్ణి కాకపోవటం నాదే తప్పు అనిపించింది.

ఆమెను సంతోష పెట్టే మార్గంకోసం చాలాసేపు ఆలోచించి, చివరకు ఆమె చుబుకాన్ని తాకి 'అంత వ్యాకులత పొందుతున్నావు ఎందుకు కాంతం?' అని అడిగినాను. ఎంతో బ్రతిమిలాడిన మీదట ఆమె జవాబు చెప్పినది.

ఆ జవాబు అయినా కోపంగానే అన్నది. ఎందుకేమిటండీ, నాకు అలాంటి కల రావలసింది కాదు. కులస్త్రీలకు ఇటువంటి కలలు వస్తయ్యా ఏమిటండీ! అందుకనే నాకు కష్టంగా ఉంది' అని ఈ మాటలు అంటూ ఉన్నప్పుడు ఆమె గొంతుక కొద్దిగా జీరపోయింది.

ఇంక అనుమానము ఏమాత్రమూ లేదు. ఆమెకు బాగా కష్టము కలిగినది. 'కాంతం, ఇందులో నా తప్పు ఏమీ లేదు. నేనేపాపమూ ఎరుగను. నేను ఎవరినీ కలలోనైనా ముద్దు పెట్టుకొని ఎరుగను. అయినా క్షమించి నీవు పడుకొని నిద్రపో' అని అంటూ నేను కాంతం నున్నని తలపైని చేయిజార్చి, భుజాలనంటి బుజ్జగించాను.

కాంతం కళ్ళువిప్పి నావంకచూచింది. రేకులు వెనుకకు విప్పుకొనిన బొద్దుమల్లెపూలు నావంక తేరిపారచూచినట్లు అయినది. ఆమె కొంచెమునేపు ఆలోచించి చివరకు ఇల్లాగ అన్నది, విడిపోయిన తన జడను బిగించి అల్లుకొంటూ.

'చూడండి, ఒక్కముక్క చెబుతున్నాను వినండి. మీరు - పరస్త్రీని ముద్దుపెట్టుకొన్నట్లు ఇంకొకసారి నాకు - కల వచ్చిందా అంటే మాటదక్కదు' - ఇల్లా అంటూ ఆమె తర్జనిని సాభిప్రాయంగా చూపింది.

ఇల్లాగ నిక్కచ్చగా చెబుతూ కాంతం తన జడను, అల్లటం పూర్తి చేసి, విసిరి వెనక్కు వేసుకొన్నది. తన కోపం అంతా నాపైన చూపటం ఎందుకూ నేనేమి చేశానూ, అని అనుకొంటూ ఆ జడ ఆమె పిరుదులపైని రెండుసార్లు అటూఇటూ ఊగి కుదటబడి ఊరుకొన్నది.

నేను ఆమె చెప్పిన మాటలు శ్రద్ధతో విని విధేయతతో తల ఊపి, భుజంపైన చెయ్యివేసి ఆమెను దగ్గరకు తీసికొని 'నీకెందుకూ ఇంతకష్టం. ఈ కలసంగతి మరచిపో, ఇంకొకసారి ఇల్లాంటి కలవచ్చినదంటే అప్పుడు నన్ను అను, అన్నాను. అలాంటి స్వప్నాలు రాకుండా నేను అప్పుడే చాలాగట్టి ఏర్పాట్లు చేసినట్టు!!

కాంతం పరితృప్తిని పొందలేదు. గునుస్తూ 'ఈ పాపిష్ఠి కల రావలసింది కాదు. దీనికేదో కాస్త శాంతి చేయించాలె' అన్నది.

'అవును' కాంతం, దీనికి నీవు తప్పక శాంతి చేయించుకోవలె' అన్నాను నేను.

“ఏమి శాంతి చేయవలెనో ఎల్లా తెలుస్తుందీ!” అని అడిగింది.

'చూడూ, కాంతం, దీనికి అట్టే పెద్దశాంతి ఏమీ, అక్కరలేదు. కలలో పరస్త్రీని ముద్దెట్టుకొన్న దోషం, ఇలలో స్వస్త్రీని ముద్దెట్టుకోటంవల్ల పోతుందనీ, కలవచ్చిన తత్క్షణం, కాల విలంబనం కాకుండా ఈ శాంతి క్రియ జరుపబడవలెననీ, శాస్త్రకారుడు

వ్రాసినాడు' అన్నాను నేను.

'చాల్లెండి, మీమాటలన్నీ ఇల్లాగే ఉంటవి వేళాకోళాలు! వెక్కిరింతలూనూ!' అని నవ్వింది కాంతం.

అయితే నామాట నమ్మవన్నమాట! కావలిస్తే ప్రమాణం చూపుతాను. పార్వతికి అల్లాగే దుస్స్వప్నం వచ్చినపుడు పరమేశ్వరుడు ఇల్లాంటి శాంతి జరిపినట్టు పురాణాలు చెబుతూ ఉన్నవి.

ఈ శాంతి ఎప్పుడూ చేయవలెనూ అని పెద్ద తర్జనభర్జన అయిందట! చివరకు 'నిశావేళ జేయనర్హంబనుచున్, విజ్ఞపనం బొనర్చిరి, విజ్ఞానేశ్వరముచూచి విద్వజ్జనులున్' అని వ్రాసిఉంది. చూశావా, ఈ శాంతి రాత్రి వేళలయందే చేయటం బహు ఉత్తమమైనదని కూడా చెప్పినారు. అని కాంతాన్ని నమ్మించి, ఆ నిశాసమయంలో చంద్రమఖండ వినిర్గతమైన వెన్నెల వెలుగులో శాస్త్రోక్తంగా శాంతి జరిపినాను.

కాంతం మొగమున పరితృప్తి సూచకమైన ఒక అమృతరేఖ తాండవించినది. 'ఇంకా భయంగానే ఉందండీ' అంటూ కాంతం, భర్తృపరిష్వంగాన ఒదిగిపోయింది.

వెన్నెలలు ఆమెజడపై, జడలోనున్న మల్లెపూలపై ఆమె ముఖముపై, ముక్కుపుడకలపై, కపోలముపై కనురెప్పలపై, కాలి పట్టాలపై, మట్టెలపై తళతళలాడి, మిలమిలమెరసి ఆమె చెక్కిళ్లపై పోరాడి, చేలాంచలములపై జీరాడి, ఆమెను జోకొట్టి నిద్ర పుచ్చినవి.

4

కాపురానికి వచ్చిన క్రొత్తరోజులలో మాకాంతం ఒక స్వప్నసుందరి, ఆమె శరీరము ముడుచుకొన్న తామరమొగ్గ. ఆమె ప్రసన్న మందహాస కాంతిలో దేవలోకపు వీధులు కనబడేవి.

మా కాంతానికి అప్పుడు పదునేడు సంవత్సరాలు. బక్కపలచగా చామనచాయగా ఉండేది. ఆవిడ రాణి అయి అప్పటికి మూడు నెలలు అయి ఉంటుంది. ఆమె మొగములో ఇంకా క్రొత్త పెండ్లికూతురుతనం పోలేదు.

మాటిమాటికి ఆమె సిగ్గుపడేది. నేనూసిగ్గుపడేవాణ్ణి. నాకంటే ఆమె ఎక్కువగా

సిగ్గుపడేది. మాట్లాడిస్తే నోటి ముత్యాలు రాలిపోతవేమో అన్నట్లు వెంటనే జవాబు చెప్పక, సిగ్గుపడి సిగ్గుపడి, చివరకు తలవంచుకొని తేనెవాక్కులు జార్చేది. మాట్లాడుతూ ఉన్నంతసేపూ పక్కవాటుగా క్రీగంటి చూపులు చూసేది. ఏమీ కారణం లేకుండా ఫక్కున నవ్వేది. నేనూ నవ్వేవాణ్ణి. ఇద్దరం నవ్వుకొనేవాళ్లం.

క్రొత్తలో ఓ స్నేహితుడి ఇంటికి వెళ్ళాము. ఆయన భార్య రత్తమ్మగారు. నేను ఆమెగారిని అక్కగారూ అని పిలిచేవాణ్ణి.

ఇద్దరం బండిదిగి లోపలికి వెళ్ళాము. రత్తమ్మగారిని చూచి మా కాంతం బెదురు చూపులు చూచింది.

నేను మా కాంతంకంటే ముందుగా అక్కగారు ఉన్న వైపుకునడచి 'అక్కగారూ మరదలును తీసుకొని వచ్చాను చూడండి' అన్నాను నవ్వుతూ.

అక్కగారు ముందు మాఇద్దరికీ కాళ్ళు కడుక్కోను నీళ్ళూ తుడుచుకొనేందుకు తువాలా, ఇచ్చింది. కాళ్ళుతుడుచుకొని అక్కడే నిలబడి ఉన్నాము.

అప్పుడు అక్కగారు మాకాంతానికి దగ్గరగా వెళ్ళి ముఖంలో ముఖంపెట్టి తేరిపారజూచి నవ్వి, భుజం మీద చెయ్యివేసి, 'నీపేరేమిటే పిల్లా' అన్నది.

కాంతం చప్పున తనపేరు చెప్పేస్తే ఈ కథ జరిగి ఉండేదికాదు. ఆమె చెప్పక నావైపు చూచింది చెప్పనావద్దా అన్నట్లు. పేరు చెబితే తమ సౌందర్యము కాస్త వన్నెతగ్గుతుందనే అనుకుంటారు ఈ ఆడవాళ్ళు. తమపేరు తమనోటితో పలుకుతూ ఉంటే వినటం ఎప్పుడుపడితే అప్పుడు లభించేవిషయం కాదని మనం అనుకొనేటట్లు చేస్తారు.

ఆమె నావంక చూచి నవ్వితే, నేను ఆమెవంక చూచి నవ్వాను. ఇద్దరినవ్వులూ కలిసినై. గదినిండా కాకి బంగారపు తళుకులు చల్లినట్లైనది.

'నీపేరేమిటంటే చెప్పవేమే' అంటూ అక్కగారు కాంతం చుబుకాన్ని తాకింది. మాఆవిడ మళ్ళీ సిగ్గుపడి నావంక చూచింది. చెప్పేయమంటారా? ఏమిటి సంగతి చెప్పండి మరి?, ఆవిడగట్టిగా అడుగుతున్నది. దానితరువాత నన్నంటే లాభంలేదు.' అని అంటున్నట్లు నాకు తోచింది.

మాకాంతం అనవసరంగా గ్రంథం పెంచుతున్నది. కాంతం అని రెండు అక్షరాలమాట అనేస్తే ఇంక ఏ ఇబ్బందీ ఉండేదికాదు. అట్లా అనక ఏదో ఈ మహాభాగ్యం అంతా ఒక్కసారి ఆవిడగారికి ఇచ్చేసివెయ్యనా అన్నట్లు చూస్తే నాకు నవ్వు వచ్చింది. ఈ దఫా నేను ఫక్కున నవ్వాను. కాంతం కూడా ముత్యాలు ఒలకపోసింది. ఒక్కసారి ఎలక్ట్రిక్ దీపాల తోరణం వెలిగినట్లయింది గదిలో.

'ఏమేపిల్లా పేరు చెప్పమంటే ఏమిటీ పెంకెతనం' అంటూ అక్కగారు కాంతంభుజాన్ని తాకింది. ఈ దఫా కాంతం పకపకా నవ్వి, 'మీరు చెప్పండి ఇక తప్పేటట్లు లేదు' అన్నట్లు నావంక చూచినది.

ఆమెగారు చెప్పకపోతే నేనెందుకు చెప్పాలి!! నేనేనా అంత తీసిపోయినది! నేను చెప్పలేదు. నువ్వే చెప్పు అన్నట్లు చూచి ఊరుకొన్నాను.

ఈ పేరునుగురించి ఏదో పెద్దరహస్యం ఉన్నట్లూ, ఆ గుట్టుకాస్తా బైట పెట్టటానికి ఇష్టంలేక మేము ఇదో నాటకం ఆడుతున్నట్లు అర్థమైంది అక్కగారికి.

అల్లా ఆమెకు అర్థము అయినట్లు ఆమె ముఖములో స్పష్టముగా తెలుస్తూనే ఉన్నది. అప్పటికైనా తన పేరు చెప్పేయవచ్చునా! కాంతం చెప్పక, బిత్తరిచూపులు చూస్తూ నుంచున్నది.

అక్కగారికి ఏమైనా కోపం వస్తుందేమోనని భయపడి, నేను ఆమెగారి ముఖం వంకేచూస్తూ నుంచున్నాను. ఒక్కక్షణం ఏదో ఆలోచిస్తున్నట్లుగా కనపడ్డది ఆమె. మరుక్షణంలో కృతనిశ్చయురాలైనట్లు మందహాసం చేసి పేరు చెప్పటానికే ఇంతసిగ్గా అమ్మా! అయితే ఉండు నీసంగతి చెపుతాను! అంటూ రత్తమ్మగారు కాంతం భుజంపైన చెయ్యివేసి తన కౌగిలిలోకి తీసికొని, ముద్దుగా, మెల్లగా, ద్వారంవైపు నడిపించుకొని పోయింది.

మాకాంతాన్ని ఎక్కడికి తీసికొని వెడుతున్నదా అనుకొన్నాను. ఆశ్చర్యముతో చూస్తూ అక్కడే నిలుచున్నాను.

అక్కగారు మా ఆవిడను సుకుమారంగా నడిపించుకొనిపోయి, గుమ్మం అవతల నుంచోబెట్టి, నన్నుకూడా రమ్మని సంజ్ఞ చేసింది. నేనూ వెళ్ళాను మాట్లాడకుండా.

అక్కగారు మాకాంతం వైపు వేలుచూపిస్తూ 'నీవు కూడా మీ ఆవిడ ప్రక్కనుంచో' అని ఆజ్ఞాపిస్తున్నట్లుగా అన్నది. ఎందుకూ? అన్నాను. ఎందుకో తెలుస్తుంది. ముందు నుంచోవోయ్ తమ్ముడా' అన్నది పోనీ తప్పేముందని నుంచున్నాను.

కాంతం ప్రక్కన నుంచోటం సరదాగానే ఉన్నది. ఆక్రొత్తలో ఆమె దగ్గర నుంచోటమన్నా, ఆవిడకు కాస్త చెయ్యి తగిలించటమన్నా నాకు చాలా సరదాగా ఉండేది. అటువంటి అవకాశంవస్తే పోనిచ్చేవాణ్ణికాదు.

నేను సగాసరి వెళ్ళి ఆమె భుజానికి భుజం తాకించి నిలుచున్నాను. నాకు గగుర్పాటు కలిగింది. మాకాంతం దేహంలో దేవలోకపు పోకడలున్నవి. ఆమె కేశబంధంలో పెట్టుకొన్నవి మల్లెపూవులే కాని సకల పుష్పజాతుల వాసనలు ఆమెను సదా అంటి పెట్టుకొనే ఉండేవి. నాకు ఆమె నిరంతర సామీప్య నిరవధికానందము అనుభవించాలని ఉండేది.

జీవితంలో రెండే బ్రహ్మానందాన్ని ఇచ్చే ఘట్టాలు. ఒకటి నూతన వధువు ప్రక్కన తాకీ తాకక నుంచోటం. రెండోది జగన్మాత సన్నిధిలో కేల్మోడిచ్చ పులకలు తీరిన శరీరంతో నిలబడటం.

మాకాంతం ప్రక్క నేను ఛాతివిరిచి నిలుచున్నాను, మంచిచక్కని భార్యను సంపాదించుకొన్నానని గర్వపడ్డాను. మా ఆవిడమటుకు సిగ్గుతో తలవంచుకొన్నది.

అక్కగారు మమ్ములనిద్దరినీ బాగా చూచి 'దూరాన్నుంచి చూస్తే, అమ్మాయే కాస్త పొడుగు అనిపిస్తుంది సుమా' అన్నది నవ్వుతూ. ఆవిడ కంటే నేను పొట్టి అనిపించుకోటం నాకు బొత్తిగా ఇష్టం లేదు. అందుకని కాస్త వళ్లు పొడుగించి తల ఎత్తాను. నా ప్రయత్నం ఎవ్వరికీ కనపడకుండానే చేశాను. కాని కాంతం పట్టేసి పకపకా నవ్వింది. అక్కగారు మమ్ములనిద్దరినీ చూచి చాలా ఆనందించింది.

నేను అన్నాను, 'ఏమిటండీ అక్కగారూ ఇది? ఎందుకు ఇల్లాగ నుంచోబెట్టారు? మమ్ములను ఫోటో తీయిస్తారా?' అని

అక్కగారు సంతోషముతో తూలిపోతూ 'ఫోటో సంగతి అనక ఆలోచిద్దాము. ముందు మీరు ఇంట్లోకి రావటానికి వీలులేదు' అని అన్నది. ఇట్లాగ ఎందుకు అన్నదో అర్థంకాలేదు.

ఏదో గాభరా పడి చూచాము ఇద్దరం కూడా. అక్కగారు మా కాంతం బుగ్గమీద పొడిచి 'అల్లా చూస్తావేమే నంగనాచిలాగ పేరు చెప్పటానికి నసిగావు! ఇప్పుడు మీరు ఇద్దరూ కూడా పేర్లు చెపితే గాని లోపలికి రానీయను. తరువాత మీ ఇష్టం.' అని గుమ్మానికి అడ్డంగా నిలుచుండి చేతులు రెండూ చాపింది ద్వారబంధానికి అడ్డంగా.

కాంతం తలవంచుకొన్నది. చెప్పు అన్నట్లు నేను కాంతం భుజాన్ని నెట్టాను. ఆవిడ మళ్ళీ దొంగ చూపులు చూచి నవ్వి, నేను భుజాన్ని తాకటంవల్ల జారిన పైట సవరించుకొని తప్పించుకొని పోదామని అటూ ఇటూ చూచింది.

అక్కగారన్నది ఇది గ్రహించి 'పారిపోవటానికి ఇది మీఇల్లు కాదే పిల్లా! ఆడబిడ్డ అంటే అసలు మొగుడన్నమాట! నామాట విన్న తరువాతే నీవు నీమొగుడు మాట వినటం. నీఆటలు ఇక్కడసాగవు?'

ఇక మా ఆటలు సాగవని స్పష్టంగా తేలిపోయింది. చెప్పమని కాంతానికి సంజ్ఞ చేశాను. చివరకు ఎల్లాగయితేనేం ఏం జెప్పేది? అన్నది కాంతం సన్నని గొంతుకతో మాధుర్యం ఒలకపోస్తూ.

ఎక్కడో కోయిల కూసినట్లు, గగనవీధిని కిన్నెర కిలకిల మన్నట్లు, మహతిపై పంచమ స్వరం పలికినట్లు అయింది.

'ఏం చెప్పాలో తెలియదేం? వగల మారి వంకాయవు!! పేరు జెప్పు' అన్నది అక్కగారు. "నా పేరేనా" అన్నది కాంతం అప్పటికి కాస్త భయం తీరి, ఆమె కళ్ళల్లోకి చూస్తూ.

అక్కగారు మళ్ళీ కాంతం రెండు చెక్కిళ్ళనూ అరచేతులతో తాకి తన కణతలకు నొక్కుకొని, 'ఎంత నంగనాచివే! నీ పేరు చెబుతావు!! నేను నీ పేరేమిటే అమ్మా, అన్నప్పుడే ఆమర్యాద కాస్తా దక్కించుకొన్నట్లయితే ఇంతవరకు వచ్చేది కాదు. ఇప్పుడు నీ మొగుడి పేరు చెప్పు.

కాంతం మళ్ళీ తలవంచి నా భుజాల మీదుగా చూచింది. కాంతం లజ్జావిహిత సర్వాంగయై మనోహరాకృతి దాల్చింది.

'ముందు నీవు చెప్పవోయ్' అన్నది అక్కగారు 'ఏం జెప్పాలమ్మా' అన్నాను. 'ఎంత అమాయకుడి లాగనటిస్తావు'. పెళ్ళాము పేరు చెప్పు, అని గట్టిగా అన్నది అక్కగారు.

పెళ్ళాము అన్న మాటలో ఉన్న మాధుర్యం ఇంకొక మాటలో లేదు. భార్య అన్నా అర్ధాంగి అన్నా ఇంకో బాష అనిపిస్తుంది.

స్త్రీకి సిగ్గు సహజము. అందులో క్రొత్తగా కాపురానికి వచ్చిన పిల్ల సిగ్గు పడటంలో విపరీతం ఏమీలేదు. కాని మొగవాడను, నేనూ సిగ్గుపడ్డాను. చప్పున చెప్పలేకపోయినాను.

మా అక్కగారు మా పెళ్ళికి రాలేదు. ఆమెకు మా ఆవిడ పేరు తెలియదు. నేను ఏదో పేరు చెప్పినా, నేను చెప్పింది సరియైన పేరు కాదని ఆమె గ్రహించటానికి ఏమాత్రం అవకాశం లేదు.

అందుకని ఏదో పేరు చెప్పుదామనుకొన్నాను. అదో సరదా అనిపించింది. అందుకని చప్పున అన్నాను. 'సుబ్బలక్ష్మీ నేనే వచ్చాను తలుపుతీయ్, అని మేఘముల చాటున ఉన్న చందమామ ఫక్కున నవ్వింది. ఆమందహాస వినిర్గతశీతల జ్యోత్స్నా వీచికలు కాంతాన్ని కప్పివేసినై.

మా ఆవిడ ఈ మాట విని విరగబడి నవ్వింది. మొగుడు తనపేరు చెప్పినందులకు సంతోషంతో అల్లాగ నవ్వుతున్నదని అక్కగారు అనుకొన్నది.. అనుకొని 'నువ్వు కూడా చెప్పవేమే! తొందరగా చెప్పు! వెళ్ళి కాఫీతాగుదాము' అని తొందర పెట్టింది కాంతాన్ని.

కాంతం నవ్వుతూ ఊరుకొంటుందేగాని ఎంతసేపటికి మాట్లాడదు. అక్కగారు కూడా పట్టుబట్టి 'ఏం పిల్లా చెబుతావా లేదా? చెప్పు. ఆయన చెప్పినా నీవు పెంకితనం చేస్తావేం? అని కోప్పడ్డది. కాంతం నన్నూ జూచి నవ్వింది, నేను చేసిన దొంగపని బైట పెట్టేస్తుందని నాకు భయం వేసింది. అందుకని, కాంతాన్ని మోచేత్తో నెట్టి కళ్ళతో, 'చెప్పు, తొందరగా కానీ నాసంగతి బైట పెట్టకు, అని ఆమెకు తెలియపరచాను.

'మీరు చెప్పండి ముందు' అన్నది కాంతం ముసిముసి నవ్వులు నవ్వుతూ 'వాడు చెప్పాడు గదటే అమ్మాయీ' అన్నది అక్కగారు అమాయకంగా, ఆమాట మీద

కాంతం 'ఆс చెప్పారు! ఏం జేప్పారు? అని విరగబడి నవ్వటంమూలాన నారహాస్యంకాస్తా బయటపడ్డది.

అక్కగారు నావంకకోపంగా చూచింది. నేను ఏదో గొప్పతప్పు చేసినట్లు తోచింది. వెంటనే నేనన్నానూ 'క్షమించండి అక్కగారూ ఇప్పుడు చెబుతాను నిజం పేరు' అని క్షమిస్తాను చెప్పు' అన్నది ఆమె ఆజ్ఞ ఇచ్చినట్లుగా గొంతుమార్చి ఠీవిగా, 'కాంతం నేనొచ్చాను తలుపుతీయి' అన్నానుపిల్లినైపోయి, అక్కగారి ముఖం ఇంతైంది.

ఇక కాంతానిదే ఆలస్యం. 'నీవు కూడా చెప్పు తల్లీ, త్వరగా వెళ్ళి కాఫీతాగుదాం' అని అక్కగారు కాంతాన్ని బుజ్జగించింది. కాంతం సిగ్గుపడుతూనే, ముసిముసి నవ్వులు నవ్వుతూనే 'రావుగారూ' నేనొచ్చాను తలుపు తీయండి. అన్నది.

అంతా పకపకా నవ్వుకున్నాము. అంతవరకు బాగానే ఉంది. ఇక ఊరుకోవచ్చునా! కాంతానికి ఎక్కడాలేని ధైర్యం వచ్చింది. సిగ్గు అంతా మాయమైనది. అక్కగారి దగ్గరకు వెళ్ళి, ఆమె చేయి పట్టుకొని, 'వదినా అంతా బాగానే ఉందిగాని మీతమ్ముడు పెళ్ళాము పేరు చెప్పమంటే సుబ్బలక్ష్మి అని చెప్పటం తప్పుకాదూ? అని అడిగింది.

'తప్పు అమ్మా చాలా తప్పు. ఎవరు కాదన్నారు' అంటూ ఆవిడ కాంతాన్ని వంటింటి వైపు నడిపించుకొని వెళ్ళింది.

'అయితే మరి ఆయన చేసిన తప్పుకు ఆయననేమి అనరా ? అని అడిగింది కాంతం విసురుగా నవ్వుతూ.

అక్కగారు ఏమంటుందో విందామని సరదాపడి నేను అక్కడేనుంచున్నాను కదలకుండా, అక్కగారు మాత్రం మూడుపీటలు వేసి మూడు వెండిగ్లాసులతో కాఫీలు పెట్టి, కాంతంతో అన్నది. 'రాఅమ్మా' కాఫీ పుచ్చుకో' అని 'మీ తమ్ముణ్ణి కోపపడితే గాని నేనురాను' అని కాంతం అన్నది కొద్దిగా కోపాన్ని నటిస్తూ.

'అయితే వాడి చెవులుపట్టుకొని, ఇక్కడికిలాక్కురా అంతకంటే పెద్దశిక్ష ప్రస్తుతం అనవసరం' అన్నది మా అక్కగారు, నవ్వుతూ.

నేను ఆమాటలు విని ఒక్క గంతులో వచ్చి పీట మీద కూర్చున్నాను. కాంతం

హాసవికసిత ముఖియై కాఫీగ్లాసు ఎత్తి నాచేతికిస్తూ కొద్దిగా నాచేతిమీద ఒలికేటట్లు చేసింది. కాస్త చుఱ్ఱుమన్నది ఏమిటిది అన్నట్లు చూశాను ఆవిడవంక. 'ఆమాత్రం కాస్తచుఱ్ఱుమనటం మంచిదే' అని అంటూ, కాంతం ముక్కుమీద వేలువేసుకొని 'అల్లాంటిపని ఎప్పుడు చెయ్యబోకండి' అని నవ్వింది.

ఆ రోజు నేను ఎక్కడికిపోలేదు; మధ్యాహ్నం కాసేపు నిద్రపోయి అయిదు గంటలకు లేచి స్నానం చేశాను. అక్కగారు నాకు క్రొత్తబట్టలు ఇచ్చింది. ఖద్దరుధోవతి, ఉత్తరీయమూను. వానిని నేను ధరించక తప్పినది కాదు. దాని తరువాత నేను ఫలహారం చేశాను.

ఫలహారం చేస్తున్నప్పుడే నేను మాకాంతాన్ని చూశాను. ఆవిడ అంతా మారిపోయింది ప్రొద్దున్న నేను చూచిన మనిషికాదు. క్రొత్తపెండ్లి కూతురులాగ తయారైంది. మొగాన నిలువుబొట్టు, కన్నులకు కాటుక, బుగ్గనచుక్క చెక్కిళ్ళకు గంధముతో, తెల్లని జరీచీరకట్టి, పట్టురెవిక తొడిగినది. ఆమెకు కూడా అక్కగారు నూతన వస్త్రాలు ఇచ్చింది. కాంతం, కాంతంలాగ లేదు. పూర్వజన్మంలో నేను చేసిన సుకృతము అంతా మనోజ్ఞాకృతి దాల్చి నాయెదుట నిలిచినట్లు ఉన్నది.

తివాసీపైన నన్ను కూర్చోమన్నది అక్కగారు. నాకు ఎదురుగా కాంతాన్ని కూర్చోబెట్టింది. మేము బంతులాడాలట! ఇది అక్కగారి సరదా!

కాంతానికి ఎక్కడలేని సిగ్గూ వచ్చింది. లజ్జతో కాంతం తలవంచుకొంది. నేను ఆమె చిన్న గడ్డాన్ని ముని వ్రేళ్ళతోతాకి, తల ఎత్తి 'అలాగ సిగ్గుపడవద్దు' అన్నాను. కాంతం మరీ సిగ్గుపడ్డది. మందార పుష్పముల కాంతిచ్ఛటలు ఆసొగసులాడి చెక్కిళ్లపై భాసిల్లినవి. ఆమె దృక్కులు ప్రసరించినంతమేర ఎఱ్ఱతామరలు పూచినవి.

పూలచెండును అక్కగారు మాయిద్దరిమధ్య పెట్టి ఊరుకొన్నది. కాంతం మాట్లాడలేదు. దానిని ముట్టుకోనూలేదు. అక్కగారు నావంక చూచి 'నువ్వుముందు విసురు' అన్నది. నేను చెండును కాంతం చేతుల్లోపడేశాను. దాన్ని నాచేతుల్లో పడేసింది. ఆమెను తాకివచ్చిన కారణంచేత ఆ పుష్పగుచ్ఛము నాశరీరానికి గగుర్పాటు కలుగజేసింది. నా వళ్లు ఝల్లుమన్నది.

అల్లాంటి ఆనందం మళ్ళీ నేను అనుభవించలేదు. నేను చెండును ఆమె పైకి

విసిరాను కాంతం తిరిగి ఆచెండును విసిరింది. ఈ పర్యాయము నావక్షస్థలానికి తాకింది నేను దానిని ఆమె వక్షోజాలవైపునకు విసిరాను. అక్కగారు పకపకా నవ్వింది. నేనూ నవ్వాను.

కాంతానికి సిగ్గూ కోపమూ, కలిసివచ్చినవి. ఆమెపూగుత్తిని ఎత్తినాచెవికి తగిలేలాగున వేసింది. 'అంతకొంటెతనం కూడదని పెండ్లి కూతురు నీతో చెప్పమన్నది' అని ఆచెండు నా చెవిలో రహస్యముగా చెప్పి, ఏమీ ఎరగనట్టు నా ఒళ్ళోకూర్చున్నది.

'నేను తగిన జవాబు చెప్పు పో' అని ఆచెండును మళ్ళీ ఆమె చెవికి తాకేలాగున విసిరి వేసాను. అది కాంతంతో ఏమి చెప్పిందో ఏమో, మొత్తం మీద కాంతం మెత్తబడి నవ్వింది. నేనూనవ్వాను. ఈ నవ్వులే రాజీకి షరతులు. ఆతరువాత అక్కగారు కాంతంచేత నాకు గంధం పూయించింది. నేనూ కూడా మాఆవిడ గడ్డానికి, బుగ్గలకు, కపోలాలకు, ముంజేతులకు గంధం పూశాను.

ఆతరువాత భోజనాలు. అప్పటికి చక్కటి వెన్నెల వచ్చింది. ఒకే వెండికంచం ఉందక్కడ. ఎదురు బొదురుగా పీటలువేసి ఉన్నవి. నేను ఒక పీట మీద కూర్చున్నాను. నాకు ఎదురుగా ఉన్నపీట ఇంకా ఖాళీగా ఉంది.

కాంతం ఎక్కడ ఉందా అని నేను ముందుకు చూస్తున్నాను. గదిలోనుంచి వస్తుందని నాఊహ అక్కగారు నా ఊహలు గ్రహించి 'నీవెనకాలె ఉందోయ్ ఏం వెదుకుతావు!' అన్నది.

ఆ మాట నిజమే! నా వెనుకనే ఉంది. కాంతమే ! క్షీరసాగరోద్భూతయైన అప్సర కన్య లాగున్నది. ఆమె చంద్రికాధిదేవత మనోహరంగా ఉంది. ఆమె కన్నులు ప్రసన్నములైన వెన్నెలలను వెలువరిస్తున్నవి. ఆమె మందహాసము శీతలజ్యోత్స్నా వీచికలను వర్షిస్తున్నది. ఆమె అంతా తెలుపే. క్షీరసాగర వినిర్గత తరంగం ఒక్కటి అక్కడ నిలిచినట్లుగా ఉన్నది. పాదముల కామె పారాణిపెట్టినది. ఎర్రతామరపై ఆమె నిలుచున్నట్లుంది.

నేను 'రా కాంతం' అన్నాను. ఆమెసిగ్గుపడి కదలలేదు. అక్కగారు ఆజ్ఞాపించినట్లు 'రావేమే' అన్నది కాంతం వస్తుంటే వెన్నెలపాయలై దారియిచ్చినట్లు తోచినది.

అన్నం కలపటం కాంతవంతు. కలిపి నాసగ భాగం నావైపుకు నెట్టితే నేను తిన్నాను. ఆమె కూడా తిన్నది పెరుగూఅన్నం రావటంతోనే నా భాగం నేను గబగబా తినేసి, ఆచెయ్యి ఆమె బుగ్గలకు పులిమి వెళ్ళిపోయి చెయికడుక్కున్నాను.

అక్కగారు ఇది చూడనట్లు నటించి 'ఏమే; పిల్లా అదేమి ఆగడమే! పెరుగుబాగుంటే ఇంకా రెండుముద్దలు తినాలె గాని, అదేం పనమ్మా ఒంటినిండా పూసుకొంటున్నావూ! అన్నది. కాంతం నవ్వి మీ తమ్ముడు సరిగ్గాతినకుండా లేచిపోయినారు చూశావా వదినా అన్నది.

అయితే – ?

'వారికోసమే కాస్తబుగ్గలకు పూసుకొన్నాను, అన్నది కాంతం. ఈ చమత్కారానికి అంతా నవ్వినాము.'

భోజనాలు అయిపోయినవి. అక్కగారు 'ఒరేతమ్ముడూ నీవుడాబాపైకి వెళ్ళు. మీ ఆవిడొచ్చి తాంబూలం ఇస్తుంది' అన్నది.

నేను పైకి వెళ్ళి పచార్లుచేస్తూ ఆ వెన్నెల వైభవాన్ని చూస్తూ ఉన్నాను. అక్కడ రెండు తెల్లనిపక్కలు ఉన్నవి. ఇంతలో అక్కగారు మరదలును వెంటబెట్టుకొని పైకి వచ్చింది. అక్కగారూ కాంతం ఒక మంచంపైని కూర్చున్నారు. నేను ఒక మంచం మీద కూర్చున్నాను.

ఏదో మాటలు వచ్చి అక్కగారు, 'నాయినా ఈ కాంతాన్ని ఎక్కడ దొరికించుకొన్నావు?' అని అడిగింది. 'నందనవనంలో కనపడితే పెండ్లి చేసుకొని తీసికొనొచ్చానండీ' అక్కగారూ అన్నాను. అక్కగారు కాంతం చెక్కిళ్లు నిమిరి 'అదృష్టవంతురాలవు. మా తమ్ముణ్ణి చేసుకొన్నావు. చేసుకోకపోతే ఏం జేసేదానివి' అన్నది. కాంతం సిగ్గుపడి తలవంచుకొని 'ఎందుకు చేసుకోరూ?' అన్నది.

అంటే చేసుకోవటం, చేసుకోకపోవటం మన చేతుల్లో ఉన్న విషయం కాదన్నమాట. కాంతం తెలివి తేటలను జూచి అక్కగారు మళ్లా సంతోషించి, ఆమెను హృదయానికి గట్టిగా అదుముకొన్నది.

ఆ సమయానికి కాంతానికి ఆవలింత వచ్చింది. ఒక చిటికె కూడా వేసింది.

అక్కగారు 'మీరు పడుకొని నిద్రపొండి' అంటూ లేచి మెట్ల వైపునకు నడిచింది. కాంతం కూడా ఆమెగారి వెంటనే నడుస్తున్నది.

కాంతం కూడా అక్కగారితో వెళ్ళటంజూచి నేను తెల్లపోవటం అదృష్టవశాత్తు ఆ వెన్నెలలో ఎవరునూ చూడలేదు. నేను కాంతం కొంగుపట్టుకు లాగడం కూడా ఎవ్వరూ చూడలేదు. అయినా కాంతం అక్కగారితో వెళ్ళుతున్నది. ఇంకా మాట్లాడుతూ కూర్చుంటారు కామాలు. ఇక ఆ మాటలకు తెరిపి ఎప్పుడో! ఆవిడ మళ్ళీ రావటం ఎప్పుడో! ఇలా అనుకొనే నేను మనస్సులో కష్టపడుతూ ఉంటే, పైగా కాంతం 'నేను క్రిందికెళ్ళి వదినతో మాట్లాడి అక్కడే పడుకొంటా'నని అన్నప్పుడు నాగుండె ఎంత కొట్టుకొన్నదో, ఆపరమేశ్వరుడికే తెలుసు.

నిజంగా కాంతం వెళ్ళుతునే ఉంది. వెనక్కు తిరిగి మళ్ళా వస్తానని సంజ్ఞ చేస్తుందేమో అనుకొన్నాను. అల్లా చేయకుండానే వెడుతున్నది. ఆ అసామాన్యమైన సంఘటన నామనస్సుకు అతిదారుణమై తోచింది.

అప్పుడు నేను 'అల్లాగే చేయికాని ఇది తీసికెళ్ళి క్రిందపెట్టు' అన్నాను. కాంతం 'ఏమిటండీ అది? అన్నది' అక్కడే నిలబడి వుంది. 'అక్కడే ఉండి కేకలు వేస్తే ఎల్లాగూ? ఇది చూశావూ, దీన్నితీసికెళ్ళి బహుజాగ్రత్తగా బీరువాలో పెట్టు' అన్నాను.

కాంతం నిజమే అనుకొని తిరిగి వస్తున్నది, వదినా ఇక్కడే ఉండు వస్తానని చెపుతూ.

కాంతం ఇటు తిరగటంతోనే అక్కగారు మెట్ల తలుపు ఠపీమని వేసి, నవ్వుకుంటూ వెళ్ళిపోయింది.

## 5

కాంతం తమ్ముడింటికి వెళ్ళి నాలుగు నెలలు అయింది. ఆవిడ తెనాలిలో, నేను బెజవాడలో ఉన్నాము. ఆ నాలుగు నెలల్లో ఒక్కసారి అయినా మాఆవిడను చూడటానికి నేను తెనాలి వెళ్లటంపడలేదు. అంత అవసరమూ లేకపోయింది వారానికి ఒక ఉత్తరం వస్తూ ఉండటం మూలాన.

ఫాల్గుణ మాసం వచ్చింది. ఆ రోజులలో, సాయంత్రం వేళ కృష్ణ నీళ్ళ చల్లదనాన్ని

దొంగిలించుకొనివచ్చి, పేదగుండెలకు పంచి ఇచ్చే చల్లనిగాలీ, విచ్చీవిచ్చని మల్లెపూవుల్లో దాక్కొని ఉన్న పరిమళమూ, హృదయదళాలను తోసికొని బైటపడి, అల్లరిగా అందరిముఖాల పైనా ఉఫ్ అని ఊదటం కల్ల కలిగిన హాయీ, దాంపత్య తపోఫలితంగా భార్యా భర్తల ఇద్దరి సుగుణాలూ పుణికిపుచ్చుకొన్న సంతానంలాగు నీళ్ళు మృత్తికాఘటంతో సహచర్యంచేసి తత్ ఫలితంగా పొందిన చల్లదనమూ, నాలో ఏవో వింత వింత భావాలనూ, విరహాన్ని రేకెత్తించినవి.

కాంతాన్ని తీసుకొద్దామని బయలుదేరాను. రైలు బయలుదేరబోతున్నది. పరుగెత్తుకొనివెళ్లి ఎక్కి కూర్చున్నాను! బండి బయలుదేరటానికి ఆపసోపాలూ పడి, అతికష్టంమీద కదిలి గర్భిణీ స్త్రీలాగ ముక్కుతూ మూల్గుతూ నడిచింది ఆరోజున.

బండిదిగి ఇంటికి వెళ్ళేసరికి కాంతం ఏంజేస్తూ ఉంటుందో! తెల్లటి మల్లెపూలు పెట్టుకొని, తెల్లనిరెవిక తొడుక్కొని తెల్లనిచీర కట్టుకొని నాకు ఎదురుగా వస్తుందా? వచ్చి తన రెండుచేతులూ నా మెడకు చుట్టవేసి ఆలింగనం చేసుకొని, నాప్రియమైన భర్తా, నేను నిన్ను ప్రేమిస్తున్నాను అని అంటుందా దొరసానిలాగు! ఇల్లాగ అనుకుంటూ కూర్చున్నాను.

బండిదిగి ఇంటికివెళ్లాను. మాకాంతం నాకెదురుగా రాలేదు. మా మరదలు వచ్చి కాళ్లుకడుక్కునేందుకు నీళ్ళు ఇచ్చింది.

మామహారాణి ఎక్కడో దాక్కున్నది. వెంటనే ఎదుటబడి నేనునిన్ను ప్రేమిస్తున్నానని అని అనటంలోకంటే, ఇల్లాగ దాక్కొని మన కోరికను బలీయం చేయడంలో అందం ఉందా ఏమిటబ్బా! అనిపించింది.

డ్రాయింగ్ రూములో కుర్చీలో కూర్చుని కాసేపు మా బావమరిదితో మాట్లాడాను. వాడు ఆసుపత్రికి వెళ్ళిపోయినాడు. నేను ఒంటరిగాణ్ణి అయి పోయినాను.

ఇక నాకు ఏమీ పని లేకపోయింది. ఎక్కడైనా, ఏవైపున అయినా కనక కంకణ ఝణఝణత్కార ధ్వనులు వినవస్తాయ్యేమోనని చెవులు రెండూ అప్పగించి కూర్చున్నాను.

మాపెద్ద అత్తగారు అప్పుడు అక్కడే ఉంది. ఆవిడవచ్చి పలకరించి క్షేమసమాచారం అడిగి వెళ్ళిపోయింది. సుందరమ్మగారు వచ్చి పలకరించి నవ్వుకుంటూ

వెళ్ళిపోయింది. సత్యవతమ్మగారు 'కాంతం మొగుడొచ్చాడట ఏడీ!' అంటూ నా దగ్గరకు వచ్చి 'నువ్వేనాబాబూ, మానాయినే, కూతుళ్ల తండ్రివిగా అంటూ దీవించి వెళ్ళిపోయింది. పడుతూ లేస్తూ, పంకజమ్మగారు కూడా వచ్చి 'నాయినా పిల్ల నాలుగు నెలల నుంచీ ఇక్కడుంటే, ఒక్కసారి అయినా వచ్చి చూచి వెళ్లడానికి నీకు తీరిక అయింది కాదు కామాలు!! రేపు నీకు కూతురుపుడితే అప్పుడు తెలిసొస్తుందుండు' అని భయపెట్టి వెళ్లిపోయింది, మాఆవిడ కాపరానికి వచ్చినప్పటి నుండి ఆడవాళ్లంతా నన్ను ఇల్లాగ అంటూనే ఉన్నారు. ఇల్లాంటి దీవనలూ, బెదరింపులూ నాకు అలవాటైపోయినవి. అల్లాంటప్పుడు నేను నవ్వి ఊరుకుంటూ ఉండేవాణ్ణి. ఆరోజునా అల్లాగే చేశాను. ఇంతకూ ఆవిడ మాత్రం నాకళ్ళకు కనపడలేదు. ఆవిడ రాకకోసం మీన మేషాలు లెక్కపెడుతూ కూర్చున్నాను.

ఇంతలో దూరాన ఒక మెఱపు మెఱిసింది. ఉలిక్కిపడి చూశాను. కాంతం వస్తున్నది - నిరీక్షణవల్ల బలపడిన కోరిక, ఆవిడ ఆగమన సౌఖ్యాన్ని తృప్తిగా అనుభవించింది.

కాంతం వచ్చి కాఫీకప్పు బల్లమీద పెడుతూ 'కులాసాగా ఉన్నారా? రావటానికి తీరికే లేకపోయింది కామాలు ఇన్నాళ్ల బట్టీ' అన్నది.

ఈ మాటలు అంటానికి ఆవిడగారికి ఒకహస్త విన్యాసమూ, ఒక అపూర్వభంగిమమూ ఒక భాష్పాంబు పూర్ణనయనమూ, క్షణక్షణత్ సంచలిత వీక్షణపరంపరా తోడైనవి. ఔత్సుక్యము, లజ్జ, హర్షము, కోపము ఇంకా ఎన్నో భావాలు కూడా, నాసాహాయ్యానికి వచ్చినై. ఇంత పెద్ద రాణువతో ఆవిడగారు నాపై దండయాత్ర సాగించింది. నేను ఓడిపోయి ఒక్క చిరునవ్వుతో ఆమెకు లొంగి పోయినాను.

నవ్వితే ఆవిడ బుగ్గపైన గుంటపడ్డది. అదివరకు ఎప్పుడూ నేను అల్లాంటియేర్పాటు చూడలేదు. చాలా ఆశ్చర్యం కలిగింది. అసలు మనిషి మనిషంతా కూడా ఏదో కొత్తగా ఉంది. కాస్తలావు అయినట్లుంది. వన్నె వచ్చింది.

ఆమె నడకలో పూర్వపు చలాకీలేదు. చూపులలో మాంద్యం, నడకలో ఠీవి వచ్చినవి. ఇదంతా నాకు చాలా కొత్తగా ఉంది.

నేను కాఫీ తాగుతున్నంతసేపూ ఆవిడ అక్కడే కుర్చీకి కాస్త ఆనుకొని నుంచుని

మాట్లాడింది. ముసలమ్మగారు ఎందుకో వచ్చి మమ్ములను చూచీ దూరాన్నుంచే, గిరుక్కున తిరిగి వెళ్లిపోయింది.

నేను తెల్లపోయి చూశాను మా ఆవిడ వంక. ఆవిడలో ఏమి మార్పు వచ్చిందో, సరిగ్గా, నేను గుర్తించలేకపోయినాను. కాని అది ఏమిటో తెలిసింది కాదు.

'ఏం, అల్లాగ ఉన్నావేం?' అన్నాను. 'ఎల్లాగ ఉన్నానూ?' అని అంటూ ఆవిడ తన శరీరాన్ని అంతటా చూపులతో తాకి చూచుకొన్నది. చూచుకొని మళ్ళీ సిగ్గుతో నవ్వింది. చెక్కిలి గుంటలు పరచుకొన్నది. ముఖం అంతా కాంతితో కళకళలాడింది.

ఆవిడ తిరిగి వెళ్ళిపోతున్నది. ఆవిడ చూపులలో, ప్రసన్నత; గర్వం, కృతజ్ఞత అన్నీ ఉన్నవి.

మరో అయిదు నిమిషాలు జరిగిపోయినై. ఆమె కపోలములను తాకివచ్చిన శీతల పవనము నా శరీరంలోని అన్ని భాగాలను తాకుతూ నాకు చక్కలిగింత పెట్టింది.

ఆవిడతో ఒక ముఖ్యమైన విషయము చెప్పటం మరిచిపోయినట్లు నాకు అప్పుడు జ్ఞాపకం వచ్చింది. వెంటనే మా మరదలును పిలిచి 'చూడు, పిల్లా, మీ అక్కయ్యను ఒక్కసారి రమ్మను' అన్నాను.

అది తుర్రున పరుగెత్తికెళ్ళి, క్షణంలో మళ్ళీ పరుగెత్తుకుంటూ వచ్చి అక్కయ్య కనపడలేదు అన్నది. 'కనపడకపోవటం ఏమిటే? గదిలో ఉంటుంది చూడు' అన్నాను. 'అయినా ఇప్పుడు అది రావటం ఎందుకూ?' అని అడిగింది. 'నీముఖం, నీకెందుకూ?' అన్నాను నేను. ఈ మాట అన్నానని దానికి కోపంవచ్చిందో ఏమో అది అక్కడ నుంచి కదలలేదు.

దాన్ని కాస్త మంచి చేసుకోకపోతే లాభం లేదని తోచి 'అదిగాదే శకుంతలా, మీఅక్కయ్యతో ఒక ముఖ్యమైన విషయం చెప్పాలె. ఇందాక చెప్పటం మరిచి పోయినాను. ఒక్కమాటు కాస్తరమ్మను.' అని బ్రతిమిలాడినట్లు చెప్పాను.

అది కాసేపు ఆలోచించి, తన తెలివినంతా ఉపయోగించి చివరకు 'బహుశః అది రాలేదు బావా, నీవే వెళ్ళు,' అని మహా పెద్దనాపసానిలాగ నాకు హితబోధ

చేసింది.

నాకు కోపమూ వచ్చింది, ఆశ్చర్యమూ కలిగింది. 'రాలేకపోవటం ఏమిటే, వంట్లో సుళువుగా లేదా?' అని అడిగాను. 'ఎట్లా ఉంటుంది బావా!' అని ఆపిల్ల తుర్రున పిట్టలాగ పరుగెత్తి పోయింది.

నాకు ఏమీ అర్థం కాలేదు. వంట్లో సుళువుగా లేకపోవటం ఏమిటి? నేను ఈ నాలుగు నెలలనుంచీ రాకపోవటం మూలాన బెంగ పెట్టుకొంది కామోలు. అందుకనే ఆరోగ్యం చెడిపోయి ఉంటుంది. అయినా బెంగపడి కృశించిన దానిలాగు లేదే అనుకొంటూ కూర్చున్నాను. ఇంతలోకే లోపలినుంచి స్నానం చెయ్యమని కబురు వచ్చింది. నేను స్నానం చేసి వెళ్ళేసరికి వడ్డన అయ్యే ఉంది. నేను కూర్చున్నాను. వడ్డించిన పదినిమిషాలకు కాంతం కూడా నెమ్మదిగా వచ్చి కూర్చున్నది.

మా అత్తగారు ఆవిడ దగ్గరకు వెళ్లి ఏమేమో వడ్డించింది. 'నీకోసం చేశానే అమ్మా ఈ చింతపండు పచ్చడి, కాస్త నాలిక్కు రాచుకో. నిమ్మకాయ బద్దతోనైనా ఓ ముద్ద తినమ్మా, మజ్జిగ పులుసురుచిగా ఉంది. కాస్త వేయించుకో' అని బ్రతిమిలాడుతున్నది.

ఈవిడను ఇంత గారాబం చెయ్యటంచూస్తే నాకు చాలా ఆశ్చర్యం కలిగింది. తనకు పుట్టింట్లో ఎంత హంగు ఉందో నాకు చూపటానికి కాంతం ఆడుతున్న నాటకమా ఇది అని అనుమానం కలిగింది.

ఈ సంగతి ఏమిటో తెలుసుకుందామని మా అత్తగారిని అడిగాను. 'ఏమండీ అంత బ్రతిమిలాడకపోతే ఆవిడగారు తనకు కావలసింది ఏదో అడిగి వేయించుకొని తినదా' అని.

ఆవిడ 'అయ్యో, బ్రతిమిలాడకపోతే ఎల్లాగ నాయినా, ఏదో ఓముద్ద అయినా లోపలికి పోవాలి' అన్నది.

ఎందుకు పోదబ్బా! ఇది వరకు మాయింట్లో ఉన్నపుడు ముద్ద బాగానే పోయేదే? అని ఆశ్చర్యపడి ఆడవాళ్లకు పుట్టింట ఉన్నపుడు ఇల్లాంటి వికారం ఏర్పడుతుంది కామాలునని మనస్సుకు సమాధానం చెప్పుకొని ఊరుకొన్నాను.

నేను ఆమెగారి గదిలోకివెళ్ళి 'ఏమిటి ఇదంతాను?' అని అడుగుదామనుకొన్నాను. మళ్ళీ అనుకొన్నాను ఎందుకూ అడగటం! తెలుస్తూనే ఉంది ఆవిడ దొరసాని పోకళ్ళు అని.

నాకు ఆ హాల్లోనే పక్క ఒకటి వేశారు. కాసేపు పడుకొని విశ్రమించాను. కాని నిద్రపట్టలేదు. ఈవిడ సంగతే ఆలోచిస్తూ పడుకొన్నాను.

ఆవిడను అంతా మహారాణిలాగ చూస్తున్నారు. అవతల చెంబు ఇవతల పెట్టనీయటంలేదు. నీవు ఊరుకోవే! ఈ వంగటం లేవటం నీకెందుకే తల్లీ! నీవు ఊరుకో 'నీవు వెళ్ళిపడుకో'. ఎంతసేపటికి ఇల్లాంటి మాటలే వినబడుతున్నవి.

అప్పటికి సాయంత్రం నాలుగు గంటలైంది. దగ్గరున్న కాఫీ హెూటలు కెళ్ళి ఒక్క అరకప్పు కాఫీ తాగుదామనుకొన్నాను. పర్సు ఆవిడ దగ్గరనే ఉంది. ప్రొద్దున నాకు కాఫీ ఇయ్యటానికి వచ్చినపుడు ఆమెకు పర్సు ఇచ్చాను జాగ్రత్తగా దాచిపెట్టమని.

మామరదలు ఆరోజున ఎందుకో మహాహడావుడిగా తిరుగుతున్నది లోపలికి బైటకీ. దాన్నిపిలిచి 'ఇదుగో' పిల్లా మీ అక్కయ్యను అడిగి రెండు రూపాయలు తీసుకొనిరా, నేను కాస్త బజారుకువెళ్ళాలె' అన్నాను.

అది వెళ్ళి సిసింద్రిలాగ పరుగెత్తికొని వచ్చి అక్కయ్య పెట్టెలో ఉందట నీపర్సు. నిన్నే వచ్చి తీసుకోమంది, అని గిరుక్కున తిరిగి వెళ్లబోతున్నది. నేనుదాని జడపట్టుకొనిలాగి నిలవేసి 'అయితే ఏమిటి పరుగెత్తటం? తాళంచెవి ఏదీ?' అన్నాను. 'దాని దగ్గరే ఉంది కామాలు వెళ్ళి అడుగు?' అని తప్పించుకొని పారిపోవటానికి ప్రయత్నం చేసింది.

జడవదిలేసి, చెయ్యిపట్టుకొని 'మీ అక్కయ్య గదిలోకి దారిచూపవే భామా?' అన్నాను. అది నాచెయ్యి వదిలించుకొని, వెనక్కువెళ్లి నన్ను నెట్టుకుంటూ తీసుకొని వెళ్ళింది వాళక్కయ్య ఉన్న గది దగ్గరకు.

నేను గది వాకిటి ముందు నుంచున్నాను. కాంతం హంసతూలికా తల్పంపైని శయనించిఉన్నది. బహుశః నిద్రలో ఉండవచ్చు. ఎందుకంటే నన్ను జూచి లేవలేదు.

నేను ఇంకా గదివాకిటి ముందు నుంచుని ఆలోచిస్తున్నాను. ఏమి చెయ్యాలె?

ప్రబంధనాయకుడు అయితే నిద్రామదమత్తురాలైన ప్రియురాలి వక్షోజానికి తగిలేటట్లుగా ఒకకోరకాన్ని విసురుతాడు. అప్పుడు ఆవిడలేస్తుంది. అల్లాంటి సామాగ్రి నాదగ్గరలేదు. మరి ఏమి చెయ్యాలా అని ఆలోచిస్తున్నాను. ఇంతలో మామరదలు నేను లోపలికి వచ్చిపడేటట్లు ఒక త్రోపు తోసి వెళ్ళిపోయింది.

మా కాంతం మేలుకొనే ఉంది. నన్ను చూచి ప్రేమతో నవ్వింది. ఆ నవ్వు వెలుగులో ఇంకో నాలుగు నెలలు ఒంటరిగా జీవించగలనని తోచింది.

ఆవిడ మాట్లాడలేదు. నా ఆగమనాన్ని నిరీక్షిస్తున్నట్లూ లేదు. ఆ అర్ధనిమీలిత నేత్రాలలో ఏవిధమైన కాంక్ష కనపడలేదు. అలసత్వమూ, మాంద్యమూ, మౌగ్ధ్యమూ ఆమె కళ్లలో గోచరిస్తున్నవి.

ఆవిడకు కోపంవచ్చి ఉంటుందా అని అనుకొని ఆలోచించి అది కోపం మటుకు కాదు అనే నిశ్చయానికి వచ్చాను. మరి ఎందుకు ఇల్లా తమాషాగా ప్రవర్తిస్తున్నదో తెలియలేదు. సరే బజారుకు వెళ్ళి కాఫీ తాగుతూ ఈ విషయాన్ని గురించి తీరికగా ఆలోచించుకొందాము అనుకొని 'కాంతం, పర్సు ఏదీ?' అన్నాను. ఆమె మాట్లాడకుండా పెట్టెవేపు వేలు చూపింది. గదికొంచెం చీకటిగానే ఉంది. కాని ఆమె చిరునవ్వు వెలుగులో ఆ పెట్టె ఎక్కడ ఉందో నాకు కనిపించింది. తాళం చెవికావాలె అన్నాను. ఆమె మళ్ళీ మందంగానే నవ్వుతూ తన మెడలో ఉన్న బంగారపు గొలుసు చూపింది. తాళంచెవి అక్కడ ఉంది. అక్కడ నుంచి తాళంచెవి తీసికొని పెట్టె తీసి నాకు కావలసిన డబ్బు తీసుకొన్నాను.

కాంతం నావంక జాలిగా చూచింది. ఈ రోజుకు ఆ చూపు నాకళ్ళల్లో మెదులుతుంది. అంతకుముందు ఎప్పుడూ అల్లాంటి చూపు నేను చూడలేదు. అవి ప్రణయ దృక్కులు కావు. ప్రసాద దృక్కులు, తృష్ణతో కూడి గుచ్చుకొనేవి కావు. అనుకంపము కలిగిస్తున్నవి.

నేను చకితుడను అయినాను. ఏదో విచిత్రమైనదీ అనిర్వచనీయమైనదీ అయినట్టి భావన నాలో ఉత్పన్నమైనది.

నేను కాంతాన్ని సమీపించి, చెక్కిలిపై చెయివేసి 'కాంతం, మహాదర్జాగా

ఉంది. నీ వ్యవహారం! పెద్ద మహారాణివై పోయినావు' అన్నాను. ఆవిడ మాట్లాడక మందహాసం చేసింది.

నేను కాంతం పడుకొని ఉన్న పక్కపై కూర్చుని, నిట్టూర్పు తాకుడువలన కొద్దిగా వాడిన ఆమె మధురాధర పల్లవాలను, తెల్లబడిన ఆమె కపోలాలలను చూస్తున్నాను. ఆమె ప్రమోదంతోనూ, అనురాగంతోనూ నావంక చూచింది.

నేను కాంతం పడుకొని ఉన్న ప్రక్కలో కొంచెం ముందుకు జరిగి, ఆమెకు అటుప్రక్కగా నాచెయ్యిని ఆనించి, ఆమెపై వంగి ఆలింగనం చేసుకోపోయినాను ఆమె అందుకు అంగీకరించక సిగ్గుపడ్డది.

నాకు అప్పటికీ ఏమీ అర్థం కాలేదు. కాక ఇంకా ఆమెను సామాన్య దృష్టితోనే చూస్తూ ఏం అల్లాగు ఉన్నావు కాంతం' అన్నాను దిగులుగా. 'ఊరికేనే' అంటూ ఆవిడ కొంచెము అవతలకి జరిగింది. ముసిముసి నవ్వులు నవ్వుతూ.

ఆ చూపుల్లో, ఆ అలసత్వంలో, నాకు ఏదో మహాత్మ్యం గోచరించింది. అప్పటికి తోచింది నాకు లోకపుసంగతి కొంత. ఏదో అనుమానం కలిగింది. నేను ఆవిడ ముఖావలోకనం చేస్తూ మళ్ళీ అడిగాను. 'కాంతం ఏమిటిది?' అని ఆవిడ కళ్ళు మూసుకొని 'ఏముందీ! అన్నది.'

ఏదో సంతోషపు పొంగులో ఆవిడ ఈదుతూ ఉన్నట్లు తోచింది. నేను ఆవిడగారి మృదువైన చెయ్యిపట్టుకొని 'అయితే ఏమన్నా!......అని ఆవాక్యం పూర్తి చేయకుండా ఊరుకొన్నాను. ఆవిడ ముసిముసి నవ్వులు నవ్వింది. నా బిక్క చూపులు చూచి మరీ నవ్వింది.

నాకేదో భయం వేసింది. ఏదో పెద్ద బాధ్యత, బరువుగా నాపై పడ్డట్లు అయింది. నేను ఏదోవింతగా కాంతం వంక చూస్తూ 'అయితే........' అని ఒకముక్క అని ఆపై ఏమీ అనలేకపోయినాను. నా అవస్థ అంతా కాంతం గ్రహించి తన రెండుచేతులూ నామెడపైని వేసింది సిగ్గుపడుతూ, నేను ఇంకా భయపడుతూనే ఉన్నాను ఏదో ఆనందం కూడా పైకి ఉబుకి వస్తున్నా.

కౌగిలి వదలి కాంతం తనరెండు చేతులతోనూ ముఖం కప్పుకొని పకపక

నవ్వింది. నేను ఆవిడ చేతులను తీసివేసి ముఖంలో ముఖంపెట్టి చూశాను. కాంతం మళ్ళా తన అరచేతులను ముఖంపైన కప్పుకొని సిగ్గుతో నవ్వింది. చాలా సిగ్గు పడుతున్నది కాంతం.

నా సందేహం అప్పటికి సగం తీరింది. అయినా అడిగాను లేచి నుంచుని 'అదేనా?' అని కాంతం లజ్జాభారంచే అవతనముఖియై తల ఊపింది.

ఎవరో వచ్చినట్లు అలికిడి అయింది. వెనక్కు తిరిగి చూశాను. మా మరదలు అక్కడ నిలబడి ఉంది. గడుసుపిల్ల నా మాటలు విన్నట్లుంది.

అది నుంచున్నది నుంచున్న పాటున విరగబడి నవ్వింది నేను తెల్లపోయినాను. ఇది ఇల్లాగ ఎందుకు నవ్వుతుందా అని ఎందుకే నవ్వుతావు అన్నాను. అది మరీ నవ్వింది. వాళ్ళ అక్కయ్య అడిగింది ఎందుకే అమ్మాయి నవ్వుతావూ ? అని. ఆ పిల్ల నవ్వు ఆపుకొని అక్కయ్యా, అదేనా ? అని మళ్ళీ విరగబడి నవ్వింది.

ఇంకా ఆ పిల్ల ఊరుకోలేదు. ఇల్లంతా గంతులు వేసింది. వాళ్ళ అమ్మమ్మ, బామ్మ, అత్తయ్య, ముసలమ్మ, అందరి దగ్గరకూ వెళ్ళి, నేను అన్నమాట, నేను అన్నపద్ధతిలో నన్ను వెక్కిరిస్తూ, 'ఏం అదేనా ? ఏం అదేనా !' ఏం అక్కయ్యా, అదేనా?' అంటూ నానా అల్లరీ చేసింది ఆ సాయంత్రం అంతా.

ఆ రోజు సాయంత్రం ఆరుగంటల బండికే నేను తిరిగి బెజవాడకు ప్రయాణమైనాను మరునాడు బడి ఉండటం మూలాన. నేను మళ్ళీ కాంతాన్ని ఇంకొకసారి కలుసుకొన్నాను వెళ్ళివస్తానని చెప్పటానికి.

వెళ్ళి వస్తానని చెప్పాను. ఇంకొకపూట ఉండరా' అన్నది. నేను మరునాడు ప్రొద్దునే స్కూలుకుపోవాలిసిన అగత్యాన్ని గురించి చెప్పాను.

కాంతం విస్తారం మాట్లాడలేదు. నావంక అతిజాలిగా ఒకచూపు చూసింది. మధురాతి మధురమై, అమృతమెన ఆచూపు ఈశుష్క జీవితానికి అంతా బలాన్ని సంతోషాన్ని ఇయ్యగలిగింది. కాంతం మాతృత్వం గ్రహించబోతున్నది. స్త్రీ జీవితంలో మాతృత్వ కార్యనిర్వహణ ఘట్టం కంటే సుందరమైనది మరొకటి లేదు. స్త్రీ జీవితములో అది ఒక రమణీయతా ప్రతి పాదకమైన పరివర్తనం. అది ఒక మధురమైన భావం.

రైలులో కూర్చుని కిటికీలో నుంచి బైటకు చూస్తున్నాను. తాంబూల సేవనవల్ల అరుణములైన లేత బాలింత పెదవులవలె ఆకాశం అంతా ఎర్రబడ్డది. రైలు వేగంగా నడిచింది.

ఇంతలో వెన్నెల వచ్చింది. కాంతం ముఖదరహాస కాంతి పరివేషమూ, నేత్రరోచిర్మండలమూ, నిర్మల యశస్సాంద్ర వీచికా సముదాయమూ, ఏకీభూతయై వెన్నెలయై సుమనోహరమై ప్రకాశిస్తున్నది.

ఆ వెన్నెలతో ఆకాశం మనోజ్ఞంగా ఉంది. లోకంలో సంసారాల్లో జరిగే శృంగార లీలలన్నీ అక్కడ ఛాయారూపాలలో చిత్రితమైనవి. కోపించిపోతూ ఉన్న భర్త ఉత్తరీయాంచలమును పట్టి లాగుతూ బ్రతిమిలాడుతున్నది ఒక్క మేఘవధూరత్నము, మరొక్కచోట భార్యాభర్తలు పరస్పరాలింగనంలో నిద్రామత్తులై కదలకుండా ఉన్నట్లున్నది. మెరుస్తూ ఉన్న జరీ అంచులు గల తెల్ల చీరకట్టిన మందగమనను ప్రియుడు సమీపించి మేలిముసుగు తొలగిస్తున్నట్లుంది ఒక చోట. జీరాడు చీరకొంగులను పట్టుకొని వ్రేలాడు పిల్లలను బుజ్జగిస్తూ వెంటబెట్టుకొని పోతున్నది ఒక మెయిలు ముత్తయిదువ, నడువలేక నడుస్తున్నవి కొన్ని గర్భిణీ మేఘాలు. బృందావనంలో కృష్ణుడు జన్మించాడని విని రంగు రంగు చీరలు ధరించి వస్తూ ఉన్న యాదవ పేరంటాండ్ర వలె మబ్బులు ఆకాశవీధిలో సంతోషంతో నడుస్తున్నవి. ఆ దాంపత్య శృంగార లీలలను ఆకాశవీధిలో చూస్తూ, కాంతంతో అనుభవించిన మధురమైన ఘట్టాలను స్మరణకు తెచ్చుకొంటూ కూర్చున్నాను. రైలు బహు వేగంగా నడిచింది.

(1.10.1945)